# గర్ల్‌ఫ్రెండ్

రిక్షా అబ్బాయి మువ్వ గలగలలాడిస్తూ ముందుకు దూసుకుపోతున్నాడు. 'ఎరైవింగ్ టెస్త్ మైల్' అని ఢిల్లీ నుంచి టెలిగ్రాం ఇచ్చాడు మామయ్య.

మెయిలు మూడుగంటలకి రావాల్సి ఉంటే టెలిగ్రాం రెండున్నరకొచ్చింది. శెలవుచీటి ఒకటి రాసి పెట్టేసి దిగ్గున లేచి రిక్షా ఎక్కేశాను.

అయినా మావయ్య ఇంత హఠాత్తుగా ఎందుకొస్తున్నట్టు ?

ఈ ప్రాంతానికి నేనే కొత్త. విజయవాడ నుంచి వచ్చి రెండు నెలలైంది. సరియైన ఇల్లు దొరకలేదు. ఆలోచన ఎవరికొచ్చిందో కాని ఆఫీసు ఊరికవతల ఆరు కిలోమీటర్ల దూరంలో ఉద్యోగులకు రవాణా సౌకర్యం ఖచ్చితంగా లేని పారిశ్రామిక ప్రాంతంలో కొట్లు పోసి పెట్టేశారు...

ఊర్లో దోమలు – నీటి ఎద్దడి – మురికి కాల్వల కంపు, జిల్లా కేంద్రం కావడంతో ఎక్కడ చూసినా రద్దీ. బజారులో దుకాణాలన్నీ రేషను షాపుల్లానే ఏడుస్తున్నాయి. పాలకి క్యూ, నీళ్లకి క్యూ, కిరసనాయిలుకి క్యూ. బట్టలకొట్టులో, బంగారం కొట్టులో రద్దీయే. గలీజు రోడ్లు – చీకటిలో గతుకులు... అసలు ఇక్కడి మనుషులు మనుషులేనా ! ఇదే బెజవాడలో అయితేనా...

'మెయిలు గంట లేటటబాఁవూ నన్నదర గొట్టేసినారు' రిక్షా అబ్బాయి జా పోస్తున్నాడు.

ఆలోచనల్లోంచి తేరుకుని ''అయితే వెళిపోతానంటావా ? మామయ్య వస్తున్నాడుగా – మళ్లీ రిక్షా కావాలని చెప్పాగా''

'' ఉంటాను బాఁవూ... ఓ రూపాయెడెయ్యండి. కసింత టీయ తాగుతా – ఈడ్నే ఉంటాలెండి''

ప్లాట్‌ఫారం టిక్కెట్టు కొనుక్కుని తీరికగా ప్లాట్‌ఫారం మీద అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఎక్కడ నుంచున్నా – ఎటు తిరుగుతున్న చేపల కంపు – లేకపోతే మిర్చి ఘాటు. ప్లాట్‌ఫారం మీద కూచోడానికని వేసిన సీట్లు అన్నీ నిండిపోయాయి. ప్లాస్టు కుర్చీలు, సిమ్మెంటు బెంచీలు – షెడ్‌స్తంభాల కోసం వేసిన దిమ్మలూ అన్నీ మనుషులు ఆక్రమించేశారు. వచ్చే బండి మూడో ప్లాట్‌ఫారం మీదకొస్తుంది.

సింహాచలం నుంచి మొక్కు తీర్చుకున్న ఓఢ్రభ్రాతలు ఎక్కడంటే అక్కడ ప్లాట్‌ఫారం మీద చక్కగా ఆదమరిచి నిద్రపోతున్నారు. విజయనగరం కోట చూడడం వాళ్ల యాత్రలో చివరి ఘట్టం. రాయపూర్ ప్యాసింజరు రాత్రి ఏడింటివరకూ రాలేదు. ప్లాట్‌ఫారం క్రిక్కిరిసిపోయింది.

మూడో సిగరెట్టు పారేస్తుండగా చటుక్కున ఆలోచన మెరిసింది. నేను సిగరెట్లు ఊదెయ్యడం వల్ల వచ్చే బండి వేగంగా వచ్చేయదు.

ఇంతకీ మావయ్యకి ఈ ఊళ్లో పనేవుందబ్బా ?. ఢిల్లీ పట్నం నుంచి ఉన్నపళంగా ఇలా దిగబడడానికి కారణం నామీద అభిమానమే !–

కావచ్చు.

మావయ్య మహా సెంటిమెంటల్‌గా ఉండే మనిషి. ఎంత మితభాషో అంత ఆత్మీయత చూపించే మనిషి. అతని చిరునవ్వులో ఏదో అందం ఉట్టిపడుతూ ఉంటుంది. కళ్లలో ఏదో చిలిపితనం – చిన్నతనం అనడం కంటె పసితనం అనడం న్యాయమేమో ! దేనినయినా అతి తేలికగా తీసుకుని

నవ్వగలిగిన మనిషి కష్టంలో కుంగిపోడు – కలిగింది కదా అని మిడిసిపడడు – కష్టం సుఖం తెలిసిన మనిషి మనుషుల్ని పుస్తకం చదివినట్లు చదివేస్తాడు.

ఒరేయ్ అబ్బీ మనిషి నేర్చుకోవాల్సింది చిరునవ్వు నవ్వడమెలా అంటూ ఒక కథ చెప్పాడు ఓసారి.

రమణాశ్రమంలో మహర్షి ఉన్న రోజుల్లో ఓమారు వెళ్లాడట సరదా ఊసుపోకకి మౌనంగా ఉన్న మహర్షిని చూసి నేరుగా ఒకటే ప్రశ్న వేశాడట.

'ఏమిటా నవ్వు ? దాని అర్థం ఏమిటి ?' అని.

–'చిరునవ్వు సాధన చేసున్నా' జవాబు.

చిరువయసులో ఉరకలేసిన చిలిపితనం మావయ్యలో ఆలోచనాశక్తి మేల్కొలిపింది. ఎంత ఆలోచనాపరుడో అంతగా తనని చూసి తెగ నవ్వుకోగలగటం అతనిలో ప్రత్యేకత.

డీజల్ ఇంజన్ ఖఁయ్‌మని శబ్దం చెయ్యడంతో మళ్లీ ప్లాట్‌ఫారం మీద కొచ్చాను.

రైల్లోంచి మావయ్య నన్ను గుర్తుపట్టడానికి వీలుగా కాక తెరిపిగా ఉన్న చోట నుంచుని ముందుకెళుతున్న కిటికీల వంకా దర్వాజాల వంకా ఆత్రంగా చూస్తున్నాను.

మావయ్య సూట్ ఇట్టే కళ్లముందునుంచి దూసుకుపోయింది.

రైలుతోనే పరిగెత్తాను.

బ్రీఫ్‌కేస్ అందుకుని '' ఏం మావయ్యా ! ప్రయాణం కులాసాగా జరిగిందా.''

'' ఆ ! మొత్తం పడుకునే వచ్చా మరి.... నా చిన్నతనంలో ఇంత సుఖం ఎరగనే ఎరగం...'' నవ్వుతూ మావయ్య నాతో నడిచాడు.

'' ఒరేయ్ బుజ్జీ... నీకెవరయినా గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారా ?'' నవ్వుతూ అడిగాడు.

నా మొహం ఎర్రగా అయిపోయింది.

''అంత సిగ్గుపడ్డమెందుకోయ్. గర్ల్‌ఫ్రెండ్ ఉండడం మా రోజుల్లోనే తప్పని నేననుకోలేదు.'

మావయ్య హాయిగా నవ్వగలడని నాకు తెలుసు. కాని మావయ్య గర్ల్‌ఫ్రెండ్‌ని నేనూహించడం అసంభవం. మావయ్య అల్లాంటివాడు కాదు.

నా మొహం చూసి ''సరేలే. మరీ అంత సీరియస్‌గా ఉండడం మనసుకి అంత ఆరోగ్యం కాదు'' అంటూ మళ్లీ ఓ చిరునవ్వు విసిరాడు.

ఇంటికి రావడం లలితను ఆప్యాయంగా పలకరించడం చంటాణ్ణి నిమిషంలో ఆకట్టుకోవడం – వాడితో ఆడుకోవటం వీటన్నింటినీ చూస్తున్న మావయ్య గర్ల్‌ఫ్రెండ్ గురించి ఆలోచిస్తూనే ఉన్నా.

మావయ్య గర్ల్‌ఫ్రెండ్ ఎలా ఉండి ఉంటుంది ?

''మావయ్యా ! అత్తయ్యను తీసుకురాలేదేం ?

'' ఓరి నీ దుంపతెగ ! దాన్నెందుకోయ్ – నాకయితే డేటా పని. దానికేం–''

''డేటా పనా?

''డియ్యే–టియ్యే–సెమినార్‌కి వచ్చా విశాఖపట్నం – నువ్విక్కడ ఉన్నావ్... చదువుకున్న ఊరు.''

''నువ్వు విజయనగరంలో చదువుకున్నావా ?''

''విజయనగరం అంటే ఏమనుకుంటున్నావ్ కుర్రనాగమ్మా. ఆరోజుల్లో అటు మద్రాసుకీ ఇటు బరంపురానికీ మధ్య ఎన్ని కాలేజీలున్నాయనుకుంటున్నావ్ ?''

ఇక్కడ చదువుకోడమంటే ఒక గౌరవం, ఒక దర్జా... అసలు ఈ ఊరు గాలిలో, నెల్లిమర్ల ఏటి నీటిలో... ఈ మట్టిలో సంగీతమేమిటి ? సాహిత్యమేమిటి ? ఈ ఊర్లోకి వచ్చి పడటం కేవలం నీ పూర్వజన్మ సుకృతం...''

నాకేమనాలో తెలియలేదు.

''మావయ్యా ఈ ఊరు నిజంగా అంత గొప్పదా...?''

భోజనాలూ అవీ అయ్యాక... ''జమ్ జమ్ కెళదాం పద !'' మా ఆవిడ కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది.

''నువ్వూ వస్తావా ?''

''అబ్బే, మీ పుత్రరత్నం నన్ను రానివ్వడు-'' అనేసింది లలిత.

''మావయ్యా ! జమ్ జమ్ అంటే?-''

''హారినీ... మూడు లాంతర్ల దగ్గర జమ్‌జమ్ కిళ్లీదుకాణం ఉండేది.... ఇలా కాలేజి మీద నుంచి దేవీ దుకాణం దగ్గరకెళ్లి మెయిన్‌రోడ్డు మీదనుంచి వస్తూ మూడు లాంతర్ల దగ్గర జమ్‌జమ్ దగ్గర ఒక కిళ్లీ బిగిస్తే... అదీ కులాసా ! ఖుషీ....''

గురజాడ వారింటిదగ్గరకొచ్చాం -

''అది కాదురా అబ్బాయ్ ! ఈ వీధిలోంచి వెళదాం...'' అంటూ సందులోకి తీసుకెళ్లాడు మావయ్య.

'' ఇది కోడుగంటివారి వీధి'' నేను వీధిలోకి తెగగొట్టేసి ఉన్న కొళాయి గొట్టాలవంకే చూస్తున్నా.....మావయ్య దృష్టిలో మురికి కాల్వలూ, ఇరుకు సందులూ, నీళ్లు పడని కొళాయిలు లేవు. అతనికి ఏదో మరో లోకంలో తిరుగుతున్న అనుభూతి కలుగుతుండడం నాకు కనిపించింది... ట్యూబ్‌లైట్ వెలుతుర్లో.

'' ఈ ఎడమచేతి పక్క ఇల్లు చూడు....''

''అవును....''

''అది మా గర్ల్‌ఫ్రెండ్‌ది...''

''మావయ్యలో ఉరకలేస్తున్న ఉత్సాహం. అరుగు ఎక్కివెళ్లి తలుపు తట్టేలా ఉన్నాడు.

''మావయ్యా ఎన్నేళ్ల కిందట ?''

''అదే చచ్చు ప్రశ్న.... ఎన్నేళ్ల క్రిందయినా గర్ల్‌ఫ్రెండ్‌కి వయసు రాదబ్బాయ్ !''

నిజానికి మావయ్య థర్డ్ బియస్సీ కుర్రాడిలా కనబడ్డాడు.

అతన్ని ఊహాలోకంలోంచి క్రిందకు తీసుకురావడం నాకు ఇష్టంలేకపోయింది.

''కుర్రనాగమ్మా ! గర్ల్‌ఫ్రెండ్ అంటే నీ మనసులో ఓ అమ్మాయి ఉంటుంది. మరి నా గర్ల్‌ఫ్రెండ్ గురించి చెబుతా....''

ఆ ఇల్లు దాటి కాలేజీ ముందుకొచ్చాం. ''సాయంకాలం కాలేజీ నుండి ఇంటికి వెళుతున్నా.... గురజాడ వారి వీధిలోంచి వెళ్లడంకంటే నాకు ఈ వీధిలోంచి వెళ్లడం సరదాగా ఉండేది. ఫిజిక్స్‌మెయిన్‌లో ఒకే ఒక అమ్మాయి ఉండేది.

ఆ అమ్మాయి పేరు సుబ్బలక్ష్మి నేను ఇందాక చూపించిన ఇంట్లో ఉండేది.

కాలేజీలో అమ్మాయిల వంక చూడడానికే భయం. అమ్మాయిలతో మాట్లాడడమే....

మేష్టర్లంటే చచ్చేటంత భయం.

క్లాస్‌లోకి మాస్టారొచ్చాక వచ్చేది సుబ్బలక్ష్మి. మాస్టారి పాఠం అయిపోగానే ముందు ఆ అమ్మాయే వెళ్లిపోయేది.

అంతే ! బయట మాటాడటం అప్పట్లో సుమారు అనూహ్యం.

''మరి గర్ల్‌ఫ్రెండ్....''

'' ఉండు నన్ను చెప్పనియ్ !''

ముందుకు వెళుతున్నాం.

''దేవీ దుకాణం ఇది... ఇక్కడ జిలేబీ... ఆ రోజుల్లో సుమారు విశాఖపట్నం జిల్లాకే ప్రసిద్ధి. అబ్బాయ్ ! ఓ అరకేజీ జిలేబీ...''

జిలేబీ పొట్లాం, మల్లెపూలూ తీసుకొని గంటస్థంభం వంక వస్తున్నాం.

'' ఈ గడియారాలు''

'' ఈ మధ్యనే పనిచేస్తున్నాయి.....''

''గడియారాలు ఆగిపోయి వుంటే నేను కాలేజీలోనే విద్యార్థిగా ఉండిపోయి ఉంటే...''

మావయ్యని చూస్తే నాకు నిజంగానే జాలివేసింది. నేను ఊరుకున్నాను.

మూడు లాంతర్ల దగ్గరకొచ్చి ''మూడు జమ్ జమ్ !'' అన్నాడు. కిళ్లీ కొట్టు మనిషి చకచకా కిళ్లీలు కడుతున్నాడు.

మావయ్య చేతిలో జిలేబీలు. నా చేతిలో పూలు,

'సుబ్బలక్ష్మి!'

'' ఆఁ చెబుతున్నా''... కిళ్లీ బుగ్గన పెట్టి – 'పద' అన్నాడు.

ఓరోజు సాయంకాలం ఇంటికొస్తుండగా

'' ఏమండీ....'' అంది సుబ్బలక్ష్మి

నా కాళ్లు ఆగిపోయాయి. బండి డిరెయిల్ అయినంత పనయింది.

''బామ్మా మరో అబ్బాయిని తీసుకొచ్చా-''

నాకు గుండె దడదడలాడింది.

''రా నాయనా లోపలకిరా....''

ఓ పెద్దావిడ నన్ను లోపలికి పిలిచింది.

''నూతి దగ్గరికి వెళ్లి కాళ్లు కడుక్కో!''

సుబ్బలక్ష్మి కోసం చుట్టూ చూశా....

''నూతి దగ్గరే వుంది.....''

నిజమే సుబ్బలక్ష్మి తువాలుతో సహా ఉంది నూతిదగ్గర.

కాళ్లూ చేతులూ కడుక్కోగానే తువాలు చేతికందించింది.

'' ఆ పీట వాల్చుకుని కూచో'' అంది పెద్దావిడ.

''మీ ఇంటి పేరు....'' ఆవిడ అడిగింది.

చెప్పాను.

''చూశావా బామ్మా నేను ఎంత సరిగ్గా పోల్చానో.....''

కొంపతీసి పెళ్లి సంబంధం కాదు గదా ?... గోత్రం అడుగుతుందేమో అనుకున్నాను.

ముందు ఓ పెద్ద అరిటాకు వేసింది.

అందులో ముందు అట్లూ – ఒక వెండిగిన్నెలో బియ్యం పరమాన్నం.

''తిను బాబూ....'' ఆవిడ వేస్తూనే ఉంది.

నేను కడుపునిండా తిన్నాను......

అయినా నా మనసులో ఏదో బెంగ.... ఈ సుబ్బలక్ష్మి వంక క్లాసులో కొన్ని కోట్లసార్లు చూశాను. కానీ ఆమె నావంక చూసిన స్వర్గక్షణం నాకయితే గుర్తులేదు.

నా మీద ఎందుకింత ఆపేక్ష?–

ఆపేక్ష అయితే మరొకర్ని తీసుకొచ్చానంటుందేం ?

కొంపతీసి ఇది స్వయంవరం కాదు కదా....

కడుపునిండా తిన్నానేమో కొంచెం ఆయాసం వస్తోంది. పీటమీద కూచున్నవాడిని గోడకి చేరగిలబడ్డా.....''

''మామ్మ నందికేశ్వరుడి నోము చేసుకుంది. ప్రసాదాలు ఇంట్లోంచి బయటికి వెళ్లకూడదు... అంతా ఖర్చయిపోవాలి.... మిగలకూడదు....''

అపుడు నా మనసులో మెరుపు మెరిసింది.

''అమ్మయ్య నా నోము ముగించావ్ బాబూ ! మీ పెద్దలకో వెయ్యి దండాలు. నీకు కోటి దీవెనలు. ఇక దీపం పెట్టుకుంటా.'' అంది ముసలావిడ.

నేను గబగబ మెట్లు దిగిపోయాను.

''సుబ్బలక్ష్మి ఇపుడు ఎక్కడ ఉందో ?'' అంటూ మావయ్య కథ ముగించాడు.

పార్కుల్లోనూ, సినిమాల్లోనూ, వీధుల్లోనూ తారసపడే కుర్రకారుల గర్ల్‌ఫ్రెండ్స్ నా మనసులోంచి మాయమయ్యారు.

ముప్ఫై ఏళ్ల క్రిందట గర్ల్‌ఫ్రెండ్‌ని మావయ్య కళ్లతో నేను చూస్తున్నాను.

''తెల్లవారుఝామునే లేవాలి.'' అంటూ మావయ్య మంచం మీద మేను వాల్చాడు.

**భారతి**

ఏప్రిల్, 1986